# దీపావళి సంబరం

## పి. గణపతిశాస్త్రి

పసిపిల్లలు నలుగు రయిదుగురు ఒకచోట గుమిగూడి కొత్తగా కొనుక్కున్న చిటపటలకేసి, రంగురంగుల అగ్గిపెట్టెలకేసి, కాకరపువ్వొత్తులకేసి వింతగా చూస్తున్నారు. పట్టరాని ఆశ్చర్యాలతో వాళ్ల కళ్ళు మాటి మాటికి పెద్దవవుతున్నాయి.

"ఇది ఢామ్మని పేలిందంటే చెవులు గళ్ళు పడిపోతాయి! తెలుసునా?"

వారిలో ఒకడు ఆటంబాంబు చూపించి ఆ మాటలతోనే మిగిలిన పిల్లలనందరిని హడలగొట్టేస్తున్నాడు! వాళ్ళందరు కొంచెం బెదురుతూ వెనక్కి తగ్గారు.

అంతలోనే మరో గడుగ్గాయి చిటపట గీసి వారిమధ్య విసిరాడు! పిల్లలందరు ఒకటే నవ్వులు! ఒకటే కేకలు! నాలుగయిదు క్షణాలలో ఆ సందడి తగ్గింది.

ఆపైన కొత్త పరికిణీ కుచ్చెళ్ళు సద్దుకుంటూ చిన్నారి సరస్వతి అక్కడికి వచ్చింది.

"అన్నయ్యా! నాకీ కాకరపువ్వొత్తి వెలిగించి పెట్టవూ?"

దానికేసి విచిత్రంగా చూస్తూ గునిసింది.

"ఇంకా చీకటిపడలేదే! కాస్సేపాగవే!"

వాళ్లన్నయ్య చెల్లెలిమీద తన అధికారం అంతా చలాయించాడు. నిజానికి అప్పటికే దీపాలు పెట్టేవేళ యింది. కాని వాడి ఘనత మాట!

"అప్పటిదాకా ఆగితే అమ్మ వస్తుందేమో! పోనీ, నేనే వెలిగించుకుంటానులే!" అంది సరస్వతి బుంగ మూతిపెట్టి.

"ఉండవే! చేతులు కాల్చుకుంటావే! నీకు చేతకాదు!" అన్నాడు సరస్వతి అన్నయ్య తనో పెద్ద మొనగాడయినట్టు!

అగ్గిపుల్ల గీసి వాడు కాకరపువ్వొత్తి కొసదగ్గిర పెట్టాడు. అది నెంబుకుందేమో! ఎంతసేపటికి వెలగలేదు! ఇంకో అగ్గిపుల్ల గీశాడు. అయినా కాకరపువ్వొత్తి అంటుకోలేదు. ఇంకోపుల్ల గీశాడు. టటాలున కాకరపువ్వొత్తి వెలుగుల పువ్వులు నలువైపుల విరజిమ్మింది!

సరస్వతి అన్నయ్య తన గొప్ప చూపించడంకోసం ఆ పువ్వుల్లో చెయ్యి పెట్టాడు. ఆ పిల్లలందరు తమ కళ్ళు మరింతగా పెద్దవిచేసి ఆ కాకరపువ్వొత్తి వంకే చూస్తున్నారు!

వాళ్ల పసిమనస్సుల్లో ఎంత సంబరం! ఎంత సరదా! వాళ్ల కళ్ళే కాకరపువ్వొత్తులై వెలిగాయి!

వాళ్లకి ఆ సమయంలో పెద్దలమనుకునేవారి మనస్సులో ధరవరలన్ని ఆకాశాని కంటుకుపోతున్నాయన్న చికాకుల చిటపటలుకాని, మరేవిధమయిన అలజడుల గొడవలుకాని దరిమానానికయినా రాలేవు! రావు! ఎంతటి అదృష్టవంతులు పసిపిల్లలు!

"అయ్యో! అయ్యో! ఇదేమిట్రా? పండుక్కని దాచిపెట్టుకున్నవన్నిఅప్పుడే తగలబెడుతున్నారుట్రా?"

అని ఆశ్చర్యపోతూ అక్కడికి వచ్చిన ఇల్లాళ్లిద్దరు ఆ పిల్లల చేతిలోని బాణాసంచా అంతా లాక్కున్నారు.

అందులో ఒకావిడ ఒక పసివాడి ఒంటిమీద కొంచెం గట్టిగానే వడ్డించిందికూడా. వాడు గుడ్ల నీరు కుక్కుకుని రాగాలుపెడుతూ తల్లి తన చేతిలోనించి లాక్కున్నవన్నీ తిరిగి ఇమ్మని మారాం మొదలుపెట్టాడు.

అవి తిరిగి ఇస్తేనేగాని అక్కణ్ణించి కదలనని ఊడిగిలపడ్డాడు. తల్లి వాణ్ణి అక్కడినించి బరబరా లాక్కుపోయింది.

ఇక మిగిలిన ఒకరిద్దరు పిల్లలు తమ గుప్పిళ్లలో అగ్గిపెట్టెలు, చిటపటలపెట్టెలు అలాగే గట్టిగా పట్టుకుని చాటుమాటుగా చల్లచల్లగా అక్కణ్ణించి తప్పుకుని బయటపడ్డారు!

ఆ ఇల్లాళ్లిద్దరు తమ చిన్నతనంలో దీపావళి సంబరాలతో, సరదాలతో అంతకంటె ఎక్కువగానే ఎగిరి ఎగిరి గంతులు వేసినవారే!

ఆనాటికి ఆనాటికి వయస్సు పైబడినకొద్ది మనుషుల మనస్సులలో ఆ చిన్ననాటి అమాయికత, ఒక్క కాకరపువ్వొత్తి వెలుగుజిలుగులతోనే అంతులేని ఆనంద తన్మయత అవధి అందుకోగలిగినంత గొప్ప సహృదయత క్రమక్రమంగా అంతరించిపోతాయి.

ఉన్నవి, లేనివి, లేనిపోని నేవేవో బెడదలు, గొడవలు కల్పించుకుంటూ, పొద్దస్తమానము వాటితోనే సతమతమయిపోతూ ప్రాయంలోనే వృద్ధులయిపోతారు మనుషులు కొందరు! అంతులేని విజ్ఞానము, సిరి



మిఠాయికన్న తియ్యగా ఉంది

ఫోటో—యలమర్తి సుదర్శనం (రాజమండ్రి)

సంపదలు, అధికారాలు చేజిక్కించుకున్నా పువ్వువంటి ఆ పసినాటి వికాసం లోపించిననాడు అవి అన్నీ ఎందుకు కొరగాకుండాపోయి మరింత వ్యథ కలిగిస్తాయి.

ఈనాటి దీపావళికి ఇంతకుమునుపు ఎప్పుడు కని విని ఎరగని అలజడు లెదురుపడిన మాట నిజమే! సామాన్య సంసారుల జీవితాలు ఆనాటి కానాటికి దుర్భరాలయిపోతున్న మాట యథార్థమే! కాని అంత మాత్రంచేత దిగులు మోపెడు పెట్టుకుని మన జిడ్డు అంతా ఇలాట్లో పసిపిల్లలకి, ఇరుగుపొరుగువారికి పట్టించడం మానవత అనిపించుకోదు. సర్వదా నవ్విస్తూ నవ్వుకుంటూ ఎంతటి గడ్డు సమస్య అయినా నిండయిన గుండెదిటవుతో ఎదుర్కొంటూ, తమ తోటివారి కింత చిరునవ్వు పంచిపెట్టగలిగిన వా రెంతటి ధన్యులు! ఎంతటి వేత్తలయినా, కుబేరులయినా, ప్రభువులయినా ఆ అహంకారాలన్ని పూర్తిగా మరిచిపోయి చిన్నపిల్లలలాగే పదిమందిలోను ఆప్యాయంగా కలిసిమెలిసి తిరుగుతూ, వారి నానందింపజేస్తూ తా మానందిస్తూ మనుగడ కొనసాగించుకో గలిగినవా రెంతటి మహనీయులు!

దీపావళి పుట్టుపూర్వోత్తరాలను గురించి మన పౌరాణికులు, చరిత్రకారులు ఎన్నెన్నో కథ లేకరువు పెడతారు. ఎన్నెన్నో అంతరార్థాలున్నాయని వ్యాఖ్యానిస్తారు. ఒక్కటిమాత్రం నిజం! భూభారం అణగించడానికని అవతరించిన ఆ శ్రీకృష్ణభగవానులే నరకాసురుడితో పోరాడి పోరాడి అలాగే అలిసిపోయారట! అంతలోనే సత్యభామాదేవి ఆయన చేతనున్న విల్లందుకున్నదై, అసహాయశూరురాలై ఆ నరకాసురుణ్ణి సంహరించివేసి అతడితోబాటు ఆ ఇహలోకనరకం కూడా పూర్తిగా తొలగించివేసిందట!

ప్రస్తుతం భారతదేశంలోను, ఆంధ్రదేశంలోను అన్ని రంగాలలోను మహిషాయుగమే నడుస్తున్నదని విజ్ఞులందరు అంటున్నారు.

పురుషపుంగవులంతా కలిసి ఇన్నాళ్లనించి ఈ పునీత భరత ధాత్రిలో ఒక ప్రత్యక్ష నరకాసురుణ్ణి సృష్టించారు! గుండెలమీద కుంపటిలా కూర్చున్న అతగాణ్ణి వెనక్కి నెట్టడానికయినా ధైర్యం చాలక వేదికలమీద నిలబడి చెవులు గింగురుమనేటట్టు హెచ్చరికలతోబాటు అల్లకల్లోలా లారంభించారు!

ఇలాంటప్పుడు మన మహిళామణులయినా ఒక్కొక్కరు ఒక్కొక్క సాత్రాజితీదేవిగా విజృంభించి ఆ నరకాసురుణ్ణి సంహరించడానికి నడుములు బిగించి, ముందుకురికి నిలబడితే చల్లని పిల్లల తల్లులన్న పేరు నిలబెట్టుకుంటారు.

ఎన్ని పండుగలున్నా తెలుగువారికి రెండే రెండు గొప్ప పండుగలు! మొదటిది దీపావళి! రెండవది సంక్రాంతి! ఈనాడు దేశంలోను, పైదేశాలలోను పరిస్థితు లెంతటి ప్రమాదకరంగా పరిణమిస్తున్నా మున్ముందు అంతా మెరుగుపడగలదన్న ఆశాజ్యోతి అందరి హృదయాలలోను నిలిచి వెలుగుతూనేఉంది!

నేటి దీపావళి వెలుగుల కలకలంలో ఆ జ్యోతి దేశంలో నలుమూలల వెయ్యి దివ్వెలై వెలగాలని కోరుకుందాము. దానికి తగినట్టుగా మనం అందరము శాయశక్తులా ప్రయత్నించినప్పుడే అది యథార్థమయిన దివ్యదీపావళి అయి ధ్రువతారకగా తరళిస్తుంది! ★